# శ్రీవారి సాపర్ధం



## జి. బాలాజీ

'మిత్రా... మిత్రా....' ఇంట్లోకి అడుగుపెడుతూనే భార్యను కేకపెట్టాడు సుధాకర్.

'ఆ వస్తున్నా... .' వంటింట్లో నుండి గబగబ ఇవతలకు వచ్చింది సుమిత్ర.

చేతిలో వున్న బట్టల ప్యాకెట్‌ను టేబుల్ మీద పెడుతూ... "వేడి వేడిగా టీ కావాలోయ్ — కాస్త నీ అమృతహస్తంతో అందిస్తే ధన్యుణ్ణి!!" షర్టును విప్పదీసి హేంగర్‌కు తగిలిస్తూ సుమిత్ర వంక చూశాడు సుధాకర్.

"అరె, పండక్కి బట్టలు తీసుకొచ్చారన్న మాట!!" అంటూ ప్యాకెట్‌ను ఆత్రుతగా విప్పదీయసాగింది.

"అవును మిత్రా — ఎప్పటి నుండో బట్టలు కొనాలనుకుంటున్నాను. ఏదీ కుదిరితేగా? ఎటూ పండుగ వస్తోంది కదాని, ఓ మూడు ప్యాంటు బిట్లూ, ఓ రెండు షర్టు ముక్కలూ కొనుక్కున్నాను. ఎలా వుందోయ్ మన సెలక్షనూ?" కళ్లెగరేస్తూ భార్యను ప్రశ్నించాడు.

తనకంటూ కనీసం ఓ జాకెట్ ముక్క కూడా అందులో లేకపోవటంతో, ఆ ప్యాకెట్‌ను విసురుగా టేబుల్‌పై పడేసి వడివడిగ లోపలికి వెళ్ళిపోయింది సుమిత్ర.

బట్టల్ని మళ్ళీ ప్యాకెట్‌లోకి సర్ది కుర్చీలో కూర్చొని వారపత్రిక అందుకున్నాడు సుధాకర్.

పది నిమిషాలు గడిచినా సుమిత్ర బయటకు రాకపోయేసరికి.....

"మిత్రా మరచిపోయినట్లున్నావ్. ఐ వాంట్ వేడి వేడి టీ. యమా అర్జంట్...." అంటూ గట్టిగా కేక పెట్టాడు సుధాకర్.

"అబ్బబ్బ — వచ్చేలోపల ఎందుకలా కాకిలా అరుస్తారు? ఇదిగో వేడి వేడి టీ..." అంటూ కాస్త విసురుగానే కప్పును భర్త చేతికందించింది సుమిత్ర.

ఆ విసురుతో టీ తొణికి చేతి మీద పడ్డంతో, గబుక్కున కప్పుని టేబుల్ మీద పెట్టి చేతుల్ని వూదుకోసాగాడు.

తక్కిన సమయాల్లో అయితే అతని చేష్టలకు నవ్వొచ్చి పకపక నవ్వేసేదే కానీ — మరిప్పుడు ఎందుకో మూతిని గట్టిగా బిగించేసింది సమిత్ర.

చేతిని వూదుకుంటూ భార్య వంక వోరగా చూస్తూ — "మిత్రా, నా సెలక్షన్ ఎలా వుందో

చెప్పనే లేదు?'' టీ సిప్ వేస్తూ అడిగాడు.

''సెలక్షన్ కేం... బా.......వుంది'' అంటూ సాగదీసి అక్కడ నుండి వెళ్ళబోయింది.

గబుక్కున భార్య చేతిని పట్టుకొని.....

''ఆగవోయ్, నీకో విషయం చెప్పాలి! మనకు పెళ్ళయిన తర్వాత వస్తున్న మొట్ట మొదటి పండుగకు ఇంకో వారం రోజులే వుంది! ఆ సందర్భంగా నాకో ఆలోచన వచ్చింది. మామూలుగా జరిగే పద్ధతులకు భిన్నంగా మనం ఓ క్రొత్త ఒరవడికి శ్రీకారం చుడితే ఎలా వుంటుందీ... అని ఆలోచించాను! దాంతో నాకీ ఐడియా తట్టింది....''

''ఏమిటీ! మీతో బాటు నాకూ ప్యాంటూ, షర్టూ తొడిగిస్తే ఎలా వుంటుందనా?!....''

''అబ్బ, అది కాదోయ్. పండక్కి రమ్మంటూ పెద్దవాళ్ళ దగ్గరనుంచి వచ్చిన ఉత్తరం చూశావుగా? మనం వెళ్ళే బదులు వాళ్ళనే ఇక్కడికి రమ్మంటే ఎలా వుంటుందీ?...'' కళ్ళెగరేస్తూ అన్నాడు సుధాకర్.

ఆ మాటలకు భర్త వంక ఆరాధనగా చూసింది సుమిత్ర.

''....అందుకని మా అమ్మా నాన్నల్ని పండక్కి ఇక్కడికే రమ్మని నిన్ననే ఉత్తరం రాసి పడేశాను...'' ఆ మాటలతో సుమిత్ర ముఖం చిన్నబోయింది.

పెద్దవాళ్ళను రమ్మనడం బాగానే వుంది. కానీ, ఆ ఆహ్వానం తన అత్తమామలకు మాత్రమేనని తెలియడంతో మనస్తాపం కలిగింది సుమిత్రకు.

వచ్చే కోపాన్ని దిగమింగుకొని ఖాళీ టీ కప్పుని అందుకొని లోనికి వెళ్ళబోయింది.

భార్యకు అడ్డుగా చేయి చాపి....

''ఇదిగో నువ్వు నాకో సాయం చేయాలి మిత్రా! నాకంటూ ఏవో బట్టలు సెలెక్షన్ చేసుకున్నాను కానీ, పెద్దవాళ్ళకు ఎలాంటివైతే బావుంటాయో నాకు బొత్తిగా తెలియదు! అందుకని వాళ్ళకు బట్టలు సెలెక్ట్ చేసే బాధ్యత నీది'' అన్నాడు సుధాకర్.

''బావుందండీ — నాకేం వచ్చని?!....''

''అదంతా నాకు తెలియదోయ్ — నువ్వు నాతో షాపింగ్‌కు రావలసిందే — బట్టలు సెలెక్షన్ చేయవలసిందే!''

మరసటి రోజు సుమిత్ర ఏదో వంకతో తప్పించుకోజూసినా, బలవంతంగా తనతో బట్టల కొట్టుకు తీసుకెళ్ళాడు సుధాకర్.



[illegible]

అత్తామామలకు కొంటున్నందువల్ల కాస్త తక్కువ ధరలోనే, నాసిరకం బట్టల్నే ఎంపిక చేసింది సుమిత్ర.

''చూడు మిత్రా! మా అమ్మా నాన్నల కన్నట్టుగాక, మీ అమ్మా నాన్నలకైతే ఎలాంటివి ఎన్నుకుంటావో అలాంటిదే సెలెక్ట్ చేయ్!'' అన్నాడు సుధాకర్.

తను ఈర్ష్యతో సరసమైనవి కొంటున్నానని అతడు గ్రహించాడని తెలుసుకుని—

''మా వాళ్ళకైనా ఇవే కొనేదాన్ని!'' అంది బింకంగా.

''అయితే లాభం లేదోయ్! ఈ విషయంలో నువ్వు నా దగ్గర శిష్యరికం చేయాల్సిందే!!'' అంటూ సుధాకర్ వాటిని కాదని మరింత బావున్నవి సెలెక్ట్ చేశాడు.

సుమిత్రకు కూడా భర్త సెలెక్షన్ నచ్చింది. అయితే బావుందని బయటకు చెప్పలేదు; పైగా ధర అధికంగా వుండటాన్ని గమనించి — 'అవున్లే తన వాళ్ళకు కొంటున్నాడుగా, ఎంతైనా ఖర్చుపెడతాడు' అనుకుంటూ మనసులోనే కుళ్ళుకొంది.

● ● ● ● ●

''...ఇదుగో మిత్రా! ఇవ్వాళ వాళ్ళు ఊరు నుండి వస్తున్నారు! కాస్త నీ కోపతాపాలు తగ్గించుకొని, వాళ్ళను జాగ్రత్తగా డీల్ చెయ్. సాయంత్రం వీలైనంత త్వరగా వచ్చేస్తా! ఏం? అర్థమైందా!'' అంటూ ఆఫీసుకు వెళ్ళిపోయాడు సుధాకర్.

''వాళ్ళు వస్తారట, తన కోపతాపాలు తగ్గించుకొని వాళ్ళని జాగ్రత్తగా డీల్ చేయాలిట. డీల్! డీల్ కాదు డ్రిల్ చేయిస్తా నుండు...'' అంటూ గొణుక్కుంటూ పనిలో పడిపోయింది సుమిత్ర.

కాలింగ్ బెల్ మ్రోగుతూంటే 'అత్తామామలు' దిగారు కాబోలు అనుకుంటూ, నింపాదిగా వెళ్ళి తలుపుతీసింది. ఎదురుగా నిల్చున్న వాళ్ళని చూసి తన కళ్ళను తనే నమ్మలేక పోయింది!

ఆనందంతో పుబ్బి తబ్బిబ్బై పోతూ, దాదాపు వాళ్ళను కౌగిలించుకున్నంత పని చేసింది సుమిత్ర.

''అంతా బావున్నారా అమ్మా? లోపలికి రండి నాన్నా....'' వాళ్ళ చేతిలోని లగేజీని అందుకొని లోపలికి దారి తీసింది సుమిత్ర.

వాళ్ళకు మంచినీళ్ళ గ్లాసును అందిస్తూ.... ''గీతా, చిట్టీ బావున్నారమ్మా! విజయకు బాబా? పాపా?'' కుశల ప్రశ్నలు వేయసాగింది సుమిత్ర.

చాన్నాళ్ళ తర్వాత తన వాళ్ళను చూడ్డంతో ఎంతో ఉత్సాహంగా, సంతోషంగా వుంది సుమిత్రకు.

ఆ రాత్రి పది గంటల ప్రాంతంలో ఇంట్లోకి అడుగుపెడుతూనే, దేదీప్యమానంగా వెలిగిపోతున్న భార్య ముఖంలోకి చూశాడు సుధాకర్.

పడక మీంచి లేచొచ్చిన అత్తమామల్ని చూసి.... ''ప్రయాణం బాగా సాగిందా అత్తయ్యా? సారీ మావయ్యా. స్టేషన్‌కు రావడానికి వీల్లేకపోయింది! ఆఫీసులో ఆడిటింగ్ జరుగుతోంది. ఒక్క క్షణం తీరిక లేదంటే నమ్మండి!?''

'ఆడిటింగూ లేదూ కాకరకాయా లేదు. అంతా వట్టిదే! తన వాళ్ళను రిసీవ్ చేసుకోడానికి ఇప్పటి దాకా బస్టాండ్‌లో పడిగాపు కాసి వస్తున్నారు...' భర్త వంక మరమర చూసింది సుమిత్ర.

''అన్నట్టు, భోజనం చేశారా మీరు?...''

''అందరిదీ అయిందయ్యా. ఇక నీదే ఆలస్యం! వెళ్ళు. వెళ్ళి భోజనం చేసిరా తర్వాత మాట్లాడుకోవచ్చు...'' అంటూ అల్లుణ్ణి భోజనానికి పురమాయించాడు సుమిత్ర నాన్నగారు.

● ● ● ● ●

''అల్లుడూ — ఏమిటిదంతా? ఇందుకా మమ్మల్ని పండక్కు రమ్మని ఉత్తరం వ్రాసింది?'' అన్నాడు సీతారామయ్య.

''కాదనకండి మావయ్యా! ఏదో నా తృప్తి కోసమైనా మీరు తీసుకోక తప్పదు—''

కొత్తబట్టల్ని అత్తామామలకు అందిస్తూ అన్నాడు సుధాకర్.

"మేము వేయాల్సిన పనిని నువ్వు చేస్తున్నావా?!" అంది జానకమ్మ.

"ఎవరు వేస్తే ఏముందత్తయ్యా? అయినా పిల్ల పెద్దలకు బట్టలు పెట్టడమన్నది తప్పేమీ కాదుగా? ఇన్నాళ్ళూ మా అమ్మానాన్నలకిచ్చాను! ఈసారి మీకిస్తున్నాను! అంతేగా తేడా!" నవ్వుతూ అన్నాడు సుధాకర్.

"అది కాదు అల్లుడూ! కొత్త దంపతులు మొదటి పండుగ నాడు మా మర్యాదలను స్వీకరించటం ఆచారం."

"ఆచార సాంప్రదాయాల పేరిట మిమ్మల్ని మరింత ఆర్థిక ఇబ్బందులకు గురిచేయటం నాకిష్టం లేదు మావయ్యా.

ఎంతో వ్యయప్రయాసల కోర్చి మీరు మా పెళ్ళి చేశారన్న విషయం నాకు తెలుసు. పైగా మీకింకా పెళ్ళి కావల్సిన కూతుళ్ళున్నారన్న విషయమూ నాకు తెలుసు.

ఈ పరిస్థితుల్లో గోరుచుట్టుపై రోకటి పోటు అన్నట్టు — పండుగనాడు సాంప్రదాయం పేరిట అల్లుడి కోరికను తీర్చటానికి మీరెంతగా అప్పుల ఊబిలోకి కూరుకుపోతారో నేనూహించగలను మావయ్యా!

ఎలాగైనా అనవసరపు ఖర్చును తప్పించాలనుకున్నాను!

అందుకే పండక్కి అక్కడికి రావడం కుదరదనీ, మిమ్మల్నే ఇక్కడకు రమ్మనీ — (అదీ 'ఒట్టిచేతులతో!'...) ఉత్తరం రాశాను..."

"ఎన్నైనా చెప్పు బాబూ, ఇది నాకేమీ నచ్చలేదు!" అంది జానకీదేవమ్మ.

"ఏమిటీ ఈ బట్టలు మీకు నచ్చలేదా? ఇవి మీ అమ్మాయి స్వయంగా సెలెక్ట్ చేసినవి అత్తయ్యా!" నవ్వుతూ అన్నాడు సుధాకర్.

"అహ. అదికాదు బాబూ, మేము ఇవ్వాల్సింది పోయి మీ నుండి తీసుకోవటం..."

"ఓకే... ఓకే... మీరు మాకు బట్టలివ్వాలి, మేము తీసుకోవాలి! అంతేకదూ! ఓకే..." అంటూ పండక్కి తమ కోసం కొన్న కొత్త బట్టల్ని వాళ్ళకిస్తూ...

"వీన్ని మీరు మాకు ఇవ్వండి మేము తీసుకుంటాం!"

అల్లుడి ఆలోచనకు ఆ రెండు హృదయాలు ఓ క్షణకాలంపాటు నోట మాటరాక మూగపోయాయి.

అప్రయత్నంగా ఎందుకో కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తేరుకుని పెదవులపై నవ్వు తెచ్చుకుని — సీతారామయ్యగారు—"అల్లుడూ! ఇది నీకు!"అన్నాడు. సుధాకర్ అందుకున్నాడు.

"అమ్మాయ్ — ఇది నీకు"

ఆశ్చర్యంగా భర్త వంక చూసింది సుమిత్ర. అల్లరిగా నవ్వుతున్నాయి సుధాకర్ కళ్ళు!

"అరె, ఈ చిన్ని ఫ్రాక్ ఎవరికీ?" ఇద్దరూ ఒకేసారి ప్రశ్నించారు.

"మీ అమ్మాయినే అడగండి!"

"అమ్మాయ్! ఏమిటి... నిజమేనా?!..."

నవ్వుతూ కూతుర్ని ప్రశ్నించింది జానకమ్మ.

సిగ్గుతో తలదించుకుంది సుమిత్ర.

ఆ రాత్రి.....

"... మిత్రా, నాతో మాట్లాడవా?.." చాలా సేపటి నుంచి పలకరించినా మాట్లాడక పోయేసరికి భార్యను దగ్గరకు తీసుకొని ముఖాన్ని పటి తలపైకెత్తాడు సుధాకర్.

సుమిత్ర కళ్ళల్లో నీళ్ళు తిరగటాన్ని గమనించి—

"అరె, ఏమిటిది— ఎందుకా కన్నీళ్ళు?" గాబరాగా ప్రశ్నించాడు.

"నాకెందుకు అంతా అబద్ధాలు చెప్పారు?"

"నేనా? అబద్ధాలు చెప్పానా?!" ఎప్పుడు— ఏమని?!" అయోమయంగా ఏమీ తెలియనట్లు అడిగాడు.

"పండక్కి మా వాళ్ళు వస్తున్నారని నాతో మాట మాత్రం ముందుగా ఎందుకు చెప్పలేదు?" నిష్ఠూరంగా అంది.

"ఓస్ అదా, మీ వాళ్ళు వస్తున్నారని నీకు ముందుగా తెలిస్తే అందులో థ్రిల్ ఏముందోయ్! కాస్త నిన్ను సర్‌ప్రైజ్ చేద్దామని చివరిదాక చెప్పలేదు. అంతేకానీ నిన్ను బాధపెట్టాలని కాదోయ్ !" భార్య ముక్కుపై ముద్దు పెట్టుకుంటూ అన్నాడు సుధాకర్.

"అదొక్కటే కాదు— బట్టల విషయంలో కూడా..."

"ఏం? నీకు నచ్చలేదా? మిత్రా, నిజం చెప్పనా ఈ చీరెలో నువ్వెంత అందంగా వున్నావో తెలుసా!" గుసగుసగా అన్నాడు.

అప్పుడెప్పుడో మాటల సందర్భంలో తనకు చిలకాకు పచ్చ రంగు అంటే ఇష్టమని చెప్పిన విషయాన్ని గుర్తు పెట్టుకుని అదే రంగులో చీరె తెచ్చిన భర్త పెదవులపై గాఢంగా ముద్దు పెట్టుకుని—

"మిమ్మల్నెంత స్వార్థపరుడనుకున్నానో తెలుసా? మరెప్పుడిలా చేయకండి." భర్తను అల్లుకుపోతూ అంది సుమిత్ర.

"అలాగే"అంటూ— సుమిత్రను మరింత దగ్గరకు పొదువుకున్నాడు సుధాకర్.

— జి. బాలాజీ.

## జనరల్ నాలెడ్జ్

1. హైదరాబాద్ రాష్ట్ర ప్రథమ ప్రజా ప్రభుత్వ ముఖ్యమంత్రి ఎవరు?
2. ఢిల్లీ సింహాసనము నధిష్టించిన మొదటి ముస్లిం మహిళ ఎవరు?
3. [illegible] నేషనల్ పార్క్ ఏ రాష్ట్రంలో ఉంది?
4. భారతదేశంలోని మొట్ట మొదటి సైన్స్ మ్యూజియం ఎక్కడ ఉన్నది?
5. జర్మనీలో వాడుకనే నాణేము పేరు ఏమి?
6. రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేసిన మొదటి మహిళ ఎవరు?
7. అంటార్కిటికాలో నడిచిన మొదటి మహిళ పేరు?
8. దేశంలో మొట్టమొదటిసారిగా టెస్ట్ ట్యూబ్ బర్త్ ఏ రాష్ట్రంలో ప్రారంభమైంది?
9. ఆక్సిజన్ లేకుండా ఎవరెస్ట్ అధిరోహణ చేసిన వ్యక్తి పేరు?
10. రాష్ట్ర విధానసభ స్పీకర్‌గా ఎన్నికైన తొలి మహిళ ఎవరు?

జవాబులు: [illegible]

— వేమూరి రామచంద్రరావు.